ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
బుధవారం 17 జులై 2024



కొత్త ఎస్పీకి సవాళ్లు

- జిల్లాలో ఎక్కడ పడితే అక్కడ గంజాయి లభ్యం
- కామన్‌గా మారిన మట్కా, గ్యాంబ్లింగ్
- ఆగని ఇసుక దందా
- పోలీసుల్లో కొందరు వైసీపీ ఫ్యాన్స్
- పోలీసింగ్‌ను మరిచిన కొందరు ఖాకీలు
- సొంతిల్లు చక్కదిద్దాల్సిందే
- నేడు బాధ్యతలు చేపట్టనున్న ఎస్పీ హర్షవర్ధన్ రాజు





(కడప-ఆంధ్రజ్యోతి): కడప.. ఇది రాష్ట్రంలోనే ఓ ప్రత్యేకత ఉన్న జిల్లా. రాజకీయంగా ప్రత్యేకమైన జిల్లా. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలకు సొంత జిల్లా. ఇక పాలిటిక్స్ పరంగా టీడీపీ, వైసీపీ బలంగా ఉన్నాయి. నిన్న జరిగిన ఎన్నికల్లో కడప పార్లమెంటు పరిధిలో ఐదు అసెంబ్లీ స్థానాలను కూటమి, రెండు స్థానాలను వైసీపీ గెలుచుకున్నాయి. అంటే జిల్లాలో కూటమి కూడా చాలా చాలా బలంగా ఉంది. అందుకే జిల్లా రాష్ట్రంలోనే కీలకమైనది. ఇక్కడ ఏం జరిగినా రాష్ట్ర దృష్టిని ఆకర్షిస్తుంది. అలాంటి కీలకమైన జిల్లాకు ఎస్పీగా హర్షవర్ధన్‌రాజు రానున్నారు. జిల్లాలో విధులు ఆయనకు సమస్యలు సవాళ్లు విసురు తున్నాయి. ఇటు అధికార పక్షం, అటు ప్రతిపక్షం బలంగా ఉండడంతో ఆయనకు కత్తిమీద సాములా మారనుంది. ముక్కుసూటితనంతో ఉంటారని, విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరిస్తారని హర్షవర్ధన్‌రాజుకు పేరుంది. ఎక్కడ పనిచేసినా తన మార్కు పోలీసింగ్ చూపిస్తారని పోలీసువర్గాల్లో పేరుంది. అలాంటి ఆయనకు ఇప్పుడు కడప గడ్డలో గాడి తప్పిన పోలీసింగ్‌ను సరిచేసేందుకు ఎన్ని సవాళ్లను ఎదుర్కోవాల్సి ఉంటుందో అని అంటున్నారు.

పోలీసింగ్ మరిచిన కొందరు ఖాకీలు

కడప జిల్లా అంటే ఒకప్పుడు బాంబులగడ్డ, ఫ్యాక్షన్‌కు అడ్డా అని పేరుండేది. అయితే ఫ్యాక్షన్ దాదాపు పరిసమాప్తమయింది. తొలిసారి చంద్రబాబు హయాంలోనే దివంగత ఎస్పీ ఉమేశ్‌చంద్ర కరుడుగట్టిన రౌడీల ఆట కట్టించారు. అలా అలా రౌడీబ్యాచ్‌కు తెరబడుతూ వచ్చింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో జగన్ పాలనలో మళ్లీ రౌడీ సంస్కృతి, ఉత్తరాదికే పరిమితమైన గంజాయి జిల్లాకు పాకింది. ఎక్కడైనా మినరల్ వాటర్ దొరకదేమో కానీ గంజాయి దొరకని ప్రాంతం లేదంటే జిల్లాలో గంజాయి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఐదేళ్ల వైసీపీ పాలనలో కొందరి వల్ల పోలీసుశాఖ తీవ్ర విమర్శలు ఎదుర్కొంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక జిల్లాలో ఎస్పీ అన్బురాజన్ పనిచేశారు. తరువాత సిద్ధార్థ్ కౌశల్ 11 నెలల పాటు విధులు నిర్వహించారు. అయితే పోలీసుపై పులివెందుల పెత్తనం తీవ్ర స్థాయిలో ఉండడంతో వైసీపీ పాలనలో పోలీసు వ్యవస్థనే నీరుగారిందనే విమర్శలున్నాయి. అందుకే జిల్లాలో ఎక్కడ చూసినా ఇసుక, గ్రావెల్ దందా, భూకబ్జాలు, గంజాయి పేట్రేగిపోయాయి.



గత ఏడాది డిసెంబరు 9న కడపలో సీఐ ఇంటి వద్ద అల్లరిమూకలు

కడపలో గంజాయి గ్యాంగులు

కడప నగరం చాలా ప్రశాంతమైన సిటీ. ఇది సర్వమతాలకు నిలయం. అలాంటి చోట గత ఐదేళ్లలో మళ్లీ పూర్వపు సంస్కృతి వచ్చింది. కొందరు వైసీపీ నేతలు వారి కబ్జాలు, సెటిల్ మెంట్ల కోసం గ్యాంగ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. కడపలో 140 గ్యాంగ్‌లు ఉన్నాయి. వీరి పనంతా సెటిల్‌మెంట్లు చేయడమే. వైసీపీ పాలనలో వారిదే రాజ్యం. అయితే ఇప్పుడు గవర్నమెంటు మారడంతో ఈ గ్యాంగ్‌లు కొన్ని కూటమి నేతలకు దగ్గరవుతున్నట్లు చెబుతున్నారు. కడపలో వీధికో ప్రాంతంలో ఉన్న ఈ గ్యాంగ్‌లకు కౌన్సెలింగ్ ఇవ్వాల్సిందే. ఇక కడపలో మద్యం కన్నా గంజాయి ఈజీగా దొరుకుతుంది. ప్యాకెట్ రూ.80 చొప్పున అమ్ముతున్నారు. మద్యం కన్నా తక్కువ ధరకు దొరకడంతో పలువురు దానినే సేవిస్తున్నారు. నిన్న ఎన్నికల ప్రచారంలో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసిన ఆర్.మాధవి గంజాయి ప్రధానాస్త్రంగా వాడుకున్నారు. ఇటీవల గంజాయి మత్తులో యువకుల మధ్య జరిగిన ఘర్షణ సమయంలో కత్తులతో పొడుచుకున్నారు. చాలా వరకు గొడవలకు పాల్పడ్డ వారంతా గంజాయి మత్తులో ఉన్నవారేనని చెబుతున్నారు. ఇక క్రికెట్ బెట్టింగ్, మట్కా మళ్లీ పురి విప్పాయి. రౌడీ గ్యాంగ్‌లు పెరిగిపోయాయి. ద్విచక్ర వాహనాలపై ప్రధాన రహదారుల్లో ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు.

ప్రొద్దుటూరులో మరలా జూదం

ప్రొద్దుటూరుకు రెండో ముంబైగా పేరుంది. ఇది బంగారం, వస్త్రాలు ఇతర వ్యాపారాలకు అడ్డా. అలాంటి ఊరు రౌడీ గ్యాంగ్‌లకు, బెట్టింగ్‌రాయుళ్లకు అడ్డాగా మారింది. వైసీపీ పాలనలో ప్రొద్దుటూరులో రౌడీరాజ్యంగా మార్చారనే ఆరోపణలున్నాయి. భూకబ్జాలు, జూదం, ఇసుక రవాణా.. ఇలా అన్నింటికీ కేరాఫ్ అయింది. అక్కడ కొందరు పోలీసులు జనంతో మమేకం కంటే బెట్టింగ్‌రాయుళ్లు, ఇసుక, మట్టి దందా అక్రమార్కులతోనే సన్నిహితంగా ఉంటారంటారు. ప్రొద్దుటూరులో ఇప్పుడు చౌటపల్లె, నరసింహాపురం మధ్య భారీ ఎత్తున జూదం నడుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. నిర్వాహకులు కొందరు పోలీసులకు మామూళ్లు ఇచ్చి అటు వైపు రాకుండా చూసుకుంటున్నారనే విమర్శ ఉంది. వైసీపీలో జూదం నిర్వహించినవారే ఎన్నికల సమయంలో టీడీపీలో చేరి మళ్లీ ఆట కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. ఇక టీడీపీ, వైసీపీ నేతలు ఇద్దరూ కలిసి ఇసుక దందా చేస్తున్నట్లు ఆరోపణలున్నాయి.

పులివెందుల మాజీ సీఎం జగన్ సొంత నియోజకవర్గం. వైసీపీ హయాంలోనే అక్కడ మట్కా జూదానికి కేరాఫ్‌గా మారిందని చెప్పేవారు. తిరిగి ఇప్పుడు అక్కడ మట్కా మొదలైనట్లు చెబుతున్నారు. ఇక మైదుకూరు, బద్వేలు, కమలాపురం, జమ్మలమడుగు గతంలో జూదానికి కేరాఫ్‌గా ఉండేవి. ఇక్కడ మళ్లీ ఇప్పుడు జూదం పురులు విప్పుతోందని చెబుతున్నారు.

ప్రక్షాళన చేయాల్సిందే

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సొంతింటిని పూర్తిగా ప్రక్షాళన చేయాల్సిందే. ఎందుకంటే పోలీసుల్లో కొందరు వైసీపీకి ఫ్యాన్స్ ఉన్నారు. పులివెందుల సిఫారసుతో కొన్ని స్టేషన్లలో తిష్ట వేసి అక్కడే ఉంటున్నారు. ప్రభుత్వం మారి నెల దాటినా కూడా ఇంకా కొందరు పోలీసులు వైసీపీ భజన చేస్తున్నారు. సీఐలు, ఎస్ఐలు, కొందరు డీఎస్పీలలో ఇంకా పాత వాసనలే ఉన్నాయి. జగన్ హయాంలో వైసీపీ వారు చెప్పిందే వేదంగా పనిచేస్తూ ఐపీసీ చట్టాలు మరిచి వైసీపీ చట్టాలు అమలు చేశారు. ఎస్పీలో పనిచేసే కొందరు ఎస్పీలనే డమ్మీ చేసి పులివెందుల పవర్‌తో జిల్లాను శాసించారు. ఈ నేపథ్యంలో నేడు ఎస్పీగా బాధ్యతలు చేపడుతున్న హర్షవర్ధన్‌రాజు సొంతింటిని ప్రక్షాళన చేస్తే తప్ప మళ్లీ పోలీసింగ్ ఊపందుకోదు.

సమష్టి కృషితో ఎన్నికలను విజయవంతంగా నిర్వహించాం

- బదిలీపై వెళుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



బదిలీపై వెళుతున్న ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్‌ను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

కడప(క్రైం), జూలై 16: జిల్లాలో ఎలాంటి చిన్న ఘటనలకు తావు లేకుండా సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా జరిగేందుకు పోలీసు సిబ్బంది సమష్టిగా విధులు నిర్వహించారని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ అభినందించారు. బదిలీపై వెళుతున్న ఎస్పీకి మంగళవారం స్థానిక పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో ఆత్మీయ వీడ్కోలు సందర్భంగా పోలీసు యంత్రాంగం గౌరవ వందనం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర డీజీపీ, ఎన్నికల ప్రధానాధికారి, ఎలక్షన్ కమిషన్, మీడియా, ప్రజలు రాజకీయ పార్టీలు జిల్లా పోలీసు యంత్రాంగాన్ని అభినందించారన్నారు. జిల్లాలో తాను బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి హోంగార్డు స్థాయి మొదలు ఉన్నతాధికారుల వరకు తనకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో ఎస్పీ వెంకట్రాముడు మాట్లాడుతూ సిద్ధార్థ్ కౌశల్ తనదైన శైలిలో జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షించి ప్రజల మన్ననలు పొందారని అన్నారు. ఎన్నికల్లో చిన్న ఘటనకు కూడా తావు లేకుండా పక్కా ప్రణాళికతో విజయవంతంగా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో, ఎన్నికల విధుల సమయంలో, సమస్యాత్మక విషయాలను ఎస్పీ పరిష్కరించే విధానం గొప్పగా ఉన్నాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ మృతి

- ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ దాడులు.. • రెండు ట్రాక్టర్లు సీజ్



ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది పట్టుకున్న ఇసుక ట్రాక్టర్లు



మరణించిన డ్రైవర్ ప్రతాప్

ప్రొద్దుటూరు, జూలై 16: ప్రొద్దుటూరులో మంగళవారం తెల్లవారుజామున కడప నుంచి వచ్చిన ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రామేశ్వరం బైపాస్ రోడ్డుపై ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్లను రెండింటిని పట్టుకున్నారు. మరో ట్రాక్టరును వెంబడించగా ఆ డ్రైవర్ రైల్వేస్టేషన్ రోడ్డు నుంచి ట్రాక్టరుకు లైట్లు ఆపి చీకట్లో పొలాల్లోకి తోలడంతో ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవరు కమటం ప్రతాప్(24) మరణించాడు. ఈ ట్రాక్టరు చౌటపల్లెలోని అధికార పార్టీకి చెందిన వ్యక్తులదని చెబుతున్నారు.
ప్రతాప్ నంద్యాల జిల్లా చాగలమర్రి గొట్లూరు గ్రామం వాసి. ఉపాధికోసం అతని కుటుంబం ప్రొద్దుటూరు వలస వచ్చిందని, నిన్ననే అతను ఇసుక ట్రాక్టరుకు వెళ్లి ఈ ప్రమాదంలో మరణించాడని బంధువులు తెలిపారు. తన భర్త తాగుబోతని, కుటుంబాన్ని పోషిస్తున్న కొడుకు పోవడంతో తామెట్లా బతకాలని అతని తల్లి రోదించారు. ఇదిలా ఉండగా ఎస్ఈబీ సీఐ మహేశ్‌ను వివరణ కోరగా తమ సిబ్బంది కడప నుంచి వచ్చి రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని స్టేషన్‌లో అప్పగించి వెళ్లిపోయారన్నారు. మరణించిన వ్యక్తి ట్రాక్టరును ఎస్ఈబీ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది వెంబడించలేదన్నారు. రెండు ట్రాక్టర్లను ఎస్ఈబీ సిబ్బంది పట్టుకోవడంతో మిగతా వాటిని పట్టుకుంటారని వాళ్లలో వాళ్లే ఫోన్లలో అప్రమత్తమై అతను ట్రాక్టర్ లైట్లు ఆపి చీకట్లో తోలుతూ ప్రమాదవశాత్తు మరణించాడని అన్నారు. కాగా.. ఈ వ్యవహారంపై ఎలాంటి కేసూ నమోదు కాలేదని తెలిసింది.

ఆర్టీపీపీ ఉద్యోగి ఖాతాలో రూ.7లక్షలు మాయం

- సైబర్ పోలీసులకు ఫిర్యాదు

ఎర్రగుంట్ల, జూలై 16: ఎర్రగుంట్ల మండలంలోని ఆర్టీపీపీ ఉద్యోగి సి.నరేంద్రనాథరెడ్డి యూనియన్ బ్యాంకు ఖాతా నుంచి రూ.7లక్షలు సైబర్ నేరగాళ్లు సోమవారం తెల్లవారుజామున ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. బాధితుడి కథనం మేరకు.. సోమవారం ఉదయం నిద్రలేచి సెల్ చూడగా యాభై వేలు కట్‌అయినట్లుగా మేసేజ్ వచ్చిందన్నారు. మేసేజ్‌లను వరుసగా ఓపెన్ చేయగా 15వ తేదీ తెల్లవారుజాము 5.07గంటలకు ఐఎంపీఎస్ఏఆర్ ద్వారా మూడు లక్షలు, లక్ష, నెఫ్ట్ ద్వారా రెండు లక్షలు, 6.07 గంటలకు ఐఎంపీఎస్ఏఆర్ ద్వారా రెండు సార్లు యాభైవేలు డ్రా చేసుకున్నట్లు మేసేజ్‌లు వచ్చాయన్నారు. వెంటనే కాల్ సెంటర్‌కు ఫోన్ చేసినా సుమారు గంట వరకు సరైన సమాచారం రాలేదన్నారు. మళ్లీ ఫిర్యాదుల శాఖకు ఫోన్ చేసి బ్యాంకు వారి ద్వారా అకౌంట్‌ను లాక్ చేయించానని తెలిపారు. ఈ విషయంపై బ్యాంకు అధికారులను కలవగా ఇది సైబర్ నేరగాళ్ల పనేనని చెప్పారని, ఖాతాలోని మొత్తాలను ఎక్కడెక్కడికి ట్రాన్స్‌ఫర్ చేశారనే విషయంపై ఆరా తీస్తున్నారన్నారు. దీనిపై కడపలోని సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.. వారు ఈ అకౌంట్స్‌ను బట్టి కూపీ లాగారని, ఇది కచ్చితంగా సైబర్ నేరగాళ్లపనేనని తేల్చారన్నారు. ఫోన్‌ను, ఆధార్‌నెంబర్ లింక్‌ను, బ్యాంక్ ఖాతాను హ్యాక్‌చేసి ఈపని చేసినట్లు వారు తెలిపారన్నారు. రాత్రి తాను నిద్రిస్తున్న సమయంలో తన ఫోన్ హ్యాక్ అయిందని చెప్పారన్నారు. ఈ విషయాన్ని మంగళగిరి సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూర్తి స్థాయిలో విచారణ జరిపి నేరగాళ్లను పట్టుకుంటామని సైబర్ పోలీసులు తెలిపారన్నారు. తనకు తెలియకుండా తన ఖాతాలోని రూ.7లక్షలు మాయంకావడంతో నరేంద్రనాథరెడ్డి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. ఆర్టీపీపీలో ఈ విషయం హాట్‌టాపిక్‌గా మారింది. ఖాతాదారులు తమ బ్యాంకు ఖాతా విషయాలపై జాగ్రత్తగా ఉండాలని సైబర్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.



ఆర్టీపీపీ ఉద్యోగి సి.నరేంద్రనాథరెడ్డి

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న క్యాంపర్

- బావ బావమరిది మృతి





మృతిచెందిన కృష్ణయ్య, రామకృష్ణయ్య

పులివెందుల టౌన్, జూలై 16: పట్టణంలోని వైఎస్సార్ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సమీపంలో మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనాన్ని నేషనల్ హైవే పనులు చేస్తున్న క్యాంపర్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో సింహాద్రిపురం మండలం బలపనూరు గ్రామానికి చెందిన మేకల రామకృష్ణయ్య (55), లింగాలమండలం లోపట్నూతల గ్రామానికి చెందిన చక్క కృష్ణయ్య (51) అక్కడికక్కడే మృతిచెందారు. బాధితుల కథనం మేరకు..
చక్క కృష్ణయ్య రెండవ కుమారుడు అమరేశ్వర్ మంగళవారం ఉదయం పాముకాటుకు గురికావడంతో పులివెందులలోని ప్రభుత్వ ఆసుపత్రికి వైద్య కోసం తీసుకెళ్లారు. చికిత్స నిమిత్తం అక్కడే అడ్మిట్ కావడంతో రాత్రిభోజనం తీసుకెళ్లేందుకు మేకల రామకృష్ణయ్య, చక్క కృష్ణయ్య ద్విచక్రవాహనంపై పులివెందులకు వచ్చారు. ఇక్కడ భోజనం తీసుకొని తిరిగి వెళ్తుండగా ఆసుపత్రి సమీపంలో వీరి వాహనాన్ని కడప నుంచి వస్తున్న క్యాంపర్ ఢీకొట్టింది. దీంతో వారు అక్కడికక్కడే మృతిచెందారు. వీరిద్దరూ బావ బావమరుదులు. ఇద్దరూ కలసి పనులు చేసుకుంటూ ఉండేవారు. ఒకేసారి వీరు మృతిచెందడంతో వారి కుటుంబాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

సింహవాహనంపై సౌమ్యనాథుడు



నందలూరు, జూలై 16: నందలూరు సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం సింహవాహనంపై సౌమ్యనాథస్వామి మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఉత్సవమూర్తులకు అభిషేకం, తిరుమంజనం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకిలో శ్రీదేవి భూదేవి సమేత సౌమ్యనాథస్వామి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి మృగరాజు అయిన సింహ వాహనంపై మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకుని గోవిందనామస్మరణలతో ఊరేగింపు వెంట కదిలివచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు, పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా 5వ రోజు బుధవారం ఉదయం పల్లకిసేవ, తిరుమంజనం, రాత్రి హనుమంత వాహనంపై స్వామి వారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జడ్పీ హైస్కూలు తనఖా..!



- సహకరించిన రెవెన్యూ అధికారులు
- వైసీపీ హయాంలో ఘటన

బి.కోడూరు, జూలై 16: గత ప్రభుత్వంలో కొండలు మింగేశారు. వాగులూ, వంకలు, చెరువుతట్లూ కబ్జా చేసేశారు. వివిధ గ్రామాల్లో పిత్రార్జితపు భూములను కూడా మిగల్చలేదు. వాటన్నింటినీ ఆన్‌లైన్‌లో ఇష్టానుసారంగా ఎక్కించుకుని వివిధ బ్యాంకుల్లో రుణాలు పొందడమే కాకుండా ఆ భూముల్లో కంచెలు, బోర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే.. ప్రభుత్వ పాఠశాల స్థలాన్నే బ్యాంకులో తనఖా పెట్టి లోనుతీసుకోవడం విశేషం. ఇటీవల కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడం, కబ్జాలపైన ఫోకస్ పెట్టడంతో ఒక్కొక్కటిగా వైసీపీ హయాంలో చోటుచేసుకున్న అక్రమాలు బయటికి వస్తున్నాయి. దీంతో నష్టపోయిన బాధితులు ఒక్కొక్క రుగా బయటికి వచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని వివరిస్తున్నారు. బి.కోడూరు మండలం గోవిందాయపల్లెలో ఓ వింత చోటు చేసుకుంది. ఏకంగా జిల్లా పరిషత్ హైస్కూలునే రెవెన్యూ అధికారులు కొండ వెంకటసుబ్బమ్మ పేరుతో ఆన్‌లైన్ చేసిచ్చేశారు. మున్నెల్లి రెవెన్యూ పొలంలో సర్వే నెం.755లో 4.12 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా పరిషత్ హైస్కూలు ఉంది. ఈ స్థలాన్ని రెవెన్యూ అధికారులు లక్ష రూపాయలు లంచం తీసుకుని కొండ వెంకటసుబ్బమ్మ పేరుతో ఆన్‌లైన్ చేసేశారని అంటున్నారు. దీంతో ఆమె ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లను బి.కోడూరు సహకార బ్యాంకులో తనఖా పెట్టి దాదాపు రూ.8లక్షల రుణం తీసుకున్నారు. ఈ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది.

పిత్రార్జితం భూములు సైతం..

గోవిందాయపల్లె గ్రామానికి చెందిన పిత్రార్జిత భూమి మున్నెల్లి రెవెన్యూ పొలంలో సర్వే నెం.755లో 2.69 ఎకరాలు, 767లో 9.88 ఎకరాలు, 793లో 6.72 ఎకరాలు ఉంది. ఇది ముగ్గురి పేరుతో ఉంది. ఈ 19.27 ఎకరాల స్థలాన్ని చాలా కాలంగా గ్రామస్తులు పశువులు మేపుకునేందుకు ఉమ్మడిగా ఉపయోగించు కుంటున్నారు. ఈ భూమిని సైతం రెవెన్యూ అధికారులు వేరేవారి పేరుతో ఆన్‌లైన్ చేసేశారు. అదే పొలంలో బోరు వేసేందుకు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకునేందుకు కూడా రెవెన్యూ అధికారులు అనుమతులు ఇచ్చారు. తమ పిత్రార్జితపు భూమిలో బయటివారు వచ్చి కంచెలు వేస్తుంటే గ్రామమంతా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. వారిని ప్రశ్నిస్తే.. ఈ స్థలం మీది కాదు మాది.. రెవెన్యూ అధికారులతో మాట్లాడుకో పోండి అని సమాధానం చెప్పారని బాధితులు వాపోతున్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఆక్రమిత పొలంలో బోర్లు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

గోవిందాయపల్లె గ్రామానికి చెందిన పిత్రార్జిత భూమి 19.27 ఎకరాలు భూమిని తప్పుదారిలో ఆన్‌లైన్ చేయించుకోవడమే కాకుండా వాటికి సంబంధిత సర్వేయరు, వీఆర్వోతో ధ్రువపత్రం పొంది బోర్లు వేసుకుని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసు కున్నారు. రెవెన్యూ అధికారులు డబ్బులు తీసుకుని ఆక్రమణదారులపై చర్యలు తీసుకోలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వంలో ఆన్‌లైన్ చేయించు కుని ప్రస్తుతం ఆ పొలాలు చదును చేసి కంచెలు వేసి సాగు చేస్తుండడంతో ఒక్కసారిగా గోవిందాయ పల్లె గ్రామస్తులు ఉలిక్కిపడ్డారు. మంగళవారం ఆ పొలం వద్దకు గ్రామస్తులంతా వెళ్లి ఆందోళన చేపట్టారు. ఈ విషయమై తహసీల్దారు మహేశ్వరి భాయిని వివరణ కోరగా పాఠశాల స్థలం రైతు పేరుతో ఆన్‌లైన్ అయిన విషయం తనకు తెలియదని, దీనిపై విచారణ చేపట్టి నిజమని తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. పిత్రార్జితం భూములు వేరే వారిపేరుతో ఆన్‌లైన్ అయిన విషయంపైనా విచారణ చేస్తామన్నారు.

వేరేవారికి ఆన్‌లైన్



ఎన్నో తరాలుగా మా గ్రామం మొత్తం ఉమ్మడిగా వాడుకుంటున్న రిజిస్టరు భూమిని ఎక్కడెక్కడి వారికో ఆన్‌లైన్ చేశారు. వారు పొలాలను చదును చేసి కంచెలు వేస్తున్నారు. పూర్వం మా గ్రామానికి చెందిన ఎద్దులు, బర్రెలు మేపుకునేందుకు గ్రామస్తులమంతా ఏకతాటిపై ఆ పొలాన్ని ఉంచుకున్నాం. ఇప్పుడు ఆ పొలమంతా వేరేవారి పేర్ల మీద ఉన్నది. దీనిపైన అధికారులు చర్యలు తీసుకుని మా పొలాన్ని మాకు ఇప్పించాలి.

- వెంగల వెంకటరెడ్డి, రైతు, గోవిందాయపల్లె

అధికారులు పట్టించుకోలేదు



మా గ్రామానికి సంబంధించిన భూమి కబ్జా చేస్తున్నారని కంచెలు వేస్తున్నారని ఎన్నో మార్లు అధికారుల వద్దకు వెళ్లి మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదు. ఇప్పుడు కూడా మా పొలాన్ని సర్వే చేయిద్దామంటే రెవెన్యూ అధికారులు సహకరించడం లేదు. ఇప్పటికైనా మా పొలాన్ని సర్వే చేసి మా గ్రామానికి అప్ప చెబితే మంచిది. దీనిపై ఉన్నతాధికారులు స్పందించాలి. లేదంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

- సానపురెడ్డి చెన్నారెడ్డి, రైతు, గోవిందాయపల్లె

సర్వజన ఆసుపత్రిలో... భద్రత ఏదీ..!

- నామమాత్రంగా భద్రతా సిబ్బంది
- అలంకార ప్రాయంగా సీసీ కెమెరాలు
- గస్తీని గాలికొదిలేసిన పోలీసులు
- దొంగలకు, తాగుబోతులకు అడ్డాగా మారుతున్న వైనం

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో భద్రత కొరవడింది. ఇక్కడ తగినంత మంది భద్రతా సిబ్బంది లేక పోవడం.. పోలీసుల నిఘా కొరవడటం... ఇక ఆసుపత్రిలో.. ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు అలంకారప్రాయంగా మారడంతో పెద్దాసుపత్రి దొంగలు, తాగుబోతులకు అడ్డాగా మారింది. దీంతో ఆసుపత్రికి వచ్చే రోగులు, రోగుల బంధువులు ఎప్పుడు ఏం జరుగుతుందోననే భయాందోళనల మధ్య గడుపుతున్నారు. ఇక కొంద రు ప్రేమికులు సైతం ఆసుపత్రిని.. ఆసుపత్రి పరిసరాలను తమ ఏకాంతం కోసం వినియోగించుకుంటున్నారు.



కడప (సెవెన్‌రోడ్స్), జూలై 16: కడప నగర పరిధిలోని పుట్లంపల్లె వద్ద సర్వజన ఆసుపత్రితో పాటు దంత వైద్యకళాశాల, వైద్యకళాశాల, రిమ్స్, నర్సింగ్ కళాశాల, మేల్, ఫీమేల్ విద్యార్థుల హాస్టళ్లు, ఔషధాలకు సంబంధించిన బిల్డింగ్, వైద్యుల నివాసాల క్వార్టర్లు ఉన్నాయి. గత సంవత్సరం కొత్తగా సూపర్ స్పెషాలిటీ, మెంటల్ మరియు క్యాన్సర్ కేర్ ఆసుపత్రులు అదనంగా ఏర్పాటు చేశారు. ప్రతి రోజూ సర్వజన ఆసుపత్రిలో సుమారు 1500 నుంచి 1700 వరకు ఓపీ ఉంటుంది. ఇక ఇన్‌పేషంట్లు, పేషంట్ల బంధువులు, ఆసుపత్రి విధుల నర్సులు, సిబ్బంది ఇలా అనేక మంది నిత్యం ఇక్కడ ఉంటారు. ఇలాంటి చోట భద్రతా సిబ్బంది కేవలం 150 మంది మాత్రమే ఉన్నారు. వీరికి రోజులో మూడు షిఫ్టులు. అంటే అందరూ ఒకేసారి డ్యూటీ చేయడానికి వీలు పడదు. ఉన్న సెక్యూరిటీ సిబ్బంది సర్వజన ఆసుపత్రి, దంత వైద్యకళాశాల, వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీ, మెంటల్, క్యాన్సర్ కేర్ మరియు ఆసుపత్రివార్డుల వద్ద విధులు నిర్వహిస్తుంటారు.

భద్రతా సిబ్బంది ఇతర పనుల్లో...

సర్వజన ఆసుపత్రిలో విధులు నిర్వహించే భద్రతా సిబ్బంది భద్రతను గాలికొదిలేసి ఆసుపత్రి ఉన్నతాధికారుల క్యారీలను మోయడం, రోగుల వీల్‌చైర్లు తీసుకెళ్లడం, ఫార్మసీ మందులు వార్డుల్లోకి తీసుకెళ్లడం వంటివి చేస్తుంటారు. అసలే అరకొరగా ఉన్న భద్రతా సిబ్బందిని వేరే పనులకు పురమాయించడంతో దొంగలకు తమ చేతివాటం ప్రదర్శించడానికి సులువు అవుతోంది. మరికొంత మంది ఉన్నతాధికారులు సెక్యూరిటీ సిబ్బందిని తమ సొంత అవసరాలకు ఇళ్లకు తీసుకెళ్లి మరీ పనిచేయించుకుంటున్నారు. కొందరు ఉన్నతాధికారులు అయితే అవసరం లేకున్నా ఆర్భాటం కోసం సెక్యూరిటీ సిబ్బందిని తమ వెంటేసుకుని నిత్యం తిరుగుతుంటారు. ఆసుపత్రిలో ఏ అవసరం వచ్చినా వెంటనే గుర్తుకు వచ్చేది సెక్యూరిటీ సిబ్బంది మాత్రమే.

అలంకారప్రాయంగా సీసీ కెమెరాలు

ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో మొన్నటి వరకు 36 సీసీ కెమెరాలు ఉండేవి. కొద్దిరోజుల క్రితం ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకుని అదనంగా 64 కెమెరాలను కలిపి వంద కెమెరాలు ఏర్పాటు చేయించారు. కెమెరాల ఏర్పాటు బాగానే ఉన్నప్పటికీ అవి ఎప్పుడు పనిచేస్తాయో లేదో ఎవరికీ తెలియదు. ప్రధాన ద్వారం వద్ద అయితే సీసీ కెమెరాలు ఉన్నాయే కానీ వాటికి కనెక్షన్ మాత్రం లేదు. మరికొన్ని చోట్ల చెట్ల మధ్యలో చెట్ల కొమ్మలతో నిండకుని ఉన్నాయి. దీంతో దొంగలు యథేచ్ఛగా ఆసుపత్రిలో తిరుగుతున్నారు.

తాగుబోతులు, దొంగలు, జులాయిలకు అన్నీ ఫ్రీ

సర్వజన ఆసుపత్రిలో ఉదయం, మధ్యాహ్నం, రాత్రి వేళల్లో నిత్యం ఎవరో ఒకరు వచ్చి ఆహారం ఉచితంగా అందిస్తుంటారు. రోగుల బంధువులమని చెప్పి వార్డుల వద్ద.. బయట పడుకుంటారు. ఇక నీళ్లు, బాత్‌రూములు అన్నీ ఫ్రీగానే లభిస్తాయి. శనివారం ఒక తాగుబోతు ఆసుపత్రికి వచ్చిన ఓ రోగితో అసభ్యంగా ప్రవర్తిస్తే సెక్యూరిటీ సిబ్బంది మందలించి పంపించివేశారు. సినిమాల్లో మాదిరిగా ఫేక్‌గా బ్యాండేజీలు చుట్టుకుని ఆసుపత్రిలోనే నిత్యం తిరుగుతుంటారు దొంగలు. కట్లు కట్టుకుని ఉండడం వల్ల రోగి అని భ్రమపడుతుంటారు. దీంతో దొంగలు వార్డుల్లోకి వెళ్లి రోగుల వస్తువులు, డబ్బులు కొట్టేస్తున్నారు. పుట్టిన బిడ్డల అపహరణ సైతం ఇలాంటి వారి వల్లనే జరుగుతోంది. రోగులు ఎవరో రోగి వెంట వచ్చే బంధువులు ఎవరో నిఘా లేకపోవడంతో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

పర్యవేక్షణ, గస్తీ లోపం

ఆసుపత్రి వార్డుల్లో తనిఖీలు, వార్డు బయట మరియు ఆసుపత్రి పరిసరాల్లో నిద్రించేవారిపై పర్యవేక్షణ లేకపోవడం, ఎవరంటే వారు వార్డుల్లోకి ప్రవేశించడం రాత్రిపూట పోలీసు గస్తీ లేకపోవడం వల్ల దొంగలకు అడ్డాగా మారిపోయింది. బైకుల దొంగతనాలకు సులువైన ప్రదేశంగా ఆసుపత్రిని చేసుకుంటున్నారు. ఇక యువజంటలు, ప్రేమికులు సైతం ఆసుపత్రిని.. ఆసుపత్రి పరిసరాలు తమ ఏకాంతం కోసం వినియోగించుకుంటున్నారు.

రోగుల భద్రతకు చర్యలు తీసుకుంటాం...

జిల్లాలోనే పెద్దాసుపత్రి కావడంతో నిత్యం వేలాది మంది ఇక్కడకు వస్తూ పోతుంటారు. రోగుల భద్రతకు అదనంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎవరైనా అనుమానాస్పదంగా వార్డుల్లో తిరిగినా వెంటనే సిబ్బందికి తెలిపితే చర్యలు తీసుకుంటాం. రాత్రివేళ తాగుబోతులు, జులాయిల బెడద ఉంది. పోలీసులు అటువంటి వారిపై కఠినంగా చర్యలు చేపట్టాలి. బైకుల చోరీలు కూడా జరుగుతున్నాయి. రోగులు ఎవరైనా ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు చేపడతాం. రోగుల వైద్యంతో పాటు భద్రత కూడా ముఖ్యం.

- డాక్టర్ శ్రీనివాసులు, సీఎస్ఆర్ఎంవో, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, కడప





ఆఫీసు పని చేస్తూ.. క్యారీయర్‌లు మోస్తూ.. రోగుల సేవల్లో భద్రతా సిబ్బంది

ఉత్కంఠగా హాకీ పోటీలు



పులివెందుల రూరల్, జూలై 16: పులివెందులలోని వైఎస్సార్ ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరుగుతున్న 2వ సౌత్‌జోన్ జూనియర్ చాంపియన్‌షిప్-2024 హాకీ పోటీలు ఉత్కంఠగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన పోటీలలో ఉమెన్స్ విభాగంలో కర్ణాటక-కేరళ జట్ల మధ్య జరగ్గా కర్ణాటక జట్టు 5గోల్స్ వేసి విజ యయం సాధించింది. అలాగే తెలంగాణ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 2 గోల్స్ వేసిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ - తమిళనాడు మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 గోల్స్ వేసి ఆంధ్రప్రదేశ్ జట్లు విజయం సాధించా యి. అలాగే మెన్స్ విభాగంలో తెలంగాణ-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 గోల్స్ వేసిన తెలంగాణ, కర్ణాటక-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6 గోల్స్ వేసిన కర్ణాటక, తమిళనాడు-ఆంధ్రప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 3 గోల్స్ వేసిన తమిళనాడు జట్లు విజయం సాధించినట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ బీఎం చాణిక్యరాజ్ తెలిపారు.

దోమల నివారణకు సహకరించండి



నీటి నిల్వల్లో లార్వాను పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారి మనోరమ

పులివెందుల రూరల్, జూలై 16: ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉం చుకొని దోమల నివారణకు సహకరించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ తెలిపారు. మంగళవారం తొండూరు మండలంలోని మల్లేల గ్రామంలో ఇళ్ల పరిసరాలను, నీటి నిల్వ ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అపరిశుభ్ర వాతావరణంలో, నీటి నిల్వ ప్రాంతాలలో దోమలు గుడ్లుపెడతాయన్నారు. వీటిని ఎప్పటికప్పుడు శుభ్రపరుచుకోవాలన్నారు. డ్రైడేపై అవగాహన కల్పించారు. దోమల వలన ప్రాణాంతక వ్యాధులు ప్రబలుతాయని ఆమె వివరించారు. సబ్‌యూనిట్ అధికారి సిద్దయ్య, ఎంపీహెచ్ఈఓ శంకర్‌రెడ్డి, సూపర్వైజర్ శశికళ, సీహెచ్ఓ సోమేశ్వరి,ఆరోగ్య కార్యకర్త వరలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లోర్ బాల్ జట్టు కెప్టెన్‌గా తేజేంద్ర



వేంపల్లె, జూలై 16: వేంపల్లె ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాచవీటి తేజేంద్ర ఆంధ్ర జట్టులో గోల్‌కీపర్ మరియు జట్టు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించనున్నారు. ఏపీ ఫ్లోర్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ జోషినాథ్, కడప జిల్లా ఫ్లోర్ బాల్ సెక్రటరీ మనోహర్‌రెడ్డిలు మాట్లాడుతూ ఇటీవల విజయవాడలో జాతీయస్థాయి ఎంపిక పోటీలు జరిగాయన్నారు. అందులో తేజేంద్ర సత్తా చాటారన్నారు. ఈనెల 18, 19, 20 తేదీలలో హర్యానా రాష్ట్రం రోహతక్‌లో జరగబోయే జాతీయ స్థాయ పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న కారు.. ఇద్దరికి తీవ్ర గాయాలు




తీవ్రంగా గాయపడిన పండిత్, గోవింద్‌యాదవ్

రైల్వేకోడూరు, జూలై 16: మండలంలోని అనంతరాజుపేట సమీపంలో మంగళవారం మోటారు సైకిల్‌ను కారు ఢీకొనడంతో ఇద్దరి యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.... అనంతరాజుపేట నుంచి మంగంపేటకు యువకులు పండిత్, గోవింద్‌యాదవ్‌లు మోటారు సైకిల్‌లో వెళుతుండగా... అదే సమయంలో హైద్రాబాద్ నుంచి తిరుమలకు వెళుతున్న కారు అదుపుతప్పి ఢీకొంది. దీంతో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వీరు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారుగా పోలీసులు గుర్తించారు. వీరు ఇళ్లకు పీఓపీ పనులు చేస్తారు. సమాచారం తెలిసిన బ్లూకోల్ట్స్ సిబ్బంది స్థానికుల సహకారంతో 108 వాహనంలో రైల్వేకోడూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలించారు. వీరిలో ఒకరి పరిస్థితి ఆందోళనకరంగా ఉందని పోలీసులు తెలిపారు.

వాహనం ఢీ... గుర్తు తెలియని వ్యక్తి మృతి

గోపవరం, జూలై 16 : నెల్లూరు-బద్వేలు ప్రధాన రహదారిపై శ్రీనివాసపురం సమీ పంలో సోమవారం అర్ధరాత్రి వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియన వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. మృతుడి వయస్సు సుమారు 50 నుంచి 60 సంవత్సరాలు ఉండవచ్చని, అతను చుట్టుపక్కల ఉన్న హోటళ్ల వద్ద యాచిస్తూ కడుపు నింపుకునేవాడు. ప్రస్తుతం అతని మృతదేహం బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రిలో ఉందని, అతని ఆచూకీ తెలిస్తే.. తమను సంప్రదించాలని బద్వేలు రూరల్ ఎస్ఐ తెలిపారు.

నూనెతో దాడిచేసిన వ్యక్తి అరెస్టు

ఒంటిమిట్ట, జూలై 16 : మండలంలోని పెన్నపేరూరు గ్రామంలో ప్రభాకర్ అనే దళిత వ్యక్తిపై నూనెతో దాడి చేసి గాయపరిచిన గజ్జల చిన్నపోల వెంకట సుబ్బారెడ్డి అనే వ్యక్తిని మంగళవారం సీఐ పురుషోత్తంరాజు ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. సీఐ వివరాల మేరకు... ఈనెల 12న సాయంత్రం మద్యం మత్తులో ప్రభాకర్ గ్రామంలోని ఓ దుకాణం వద్ద అరుపులు, కేకలు వేస్తూ అరుగుపై పడుకోవడంతో అదే గ్రామానికి చెందిన గజ్జల చిన్నపోల వెంకట సుబ్బారెడ్డి కట్టెతో దాడి చేసి.. పక్కనే ఉన్న వేడి నూనెను పోయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాధితుడి ఫిర్యాదు మేరకు.. పోలీసులు విచారించి ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం స్థానిక కోదండ రామాలయ కల్యాణ వేదిక ప్రాం తంలో వెంటసుబ్బారెడ్డిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరచగా.. ఈనెల 30 వరకు రిమాండ్ విధించినట్లు డీఎస్పీ తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లర్ అరెస్టు



కడప (క్రైం), జూలై 16: లంకమల్ల రిజర్వు అటవీప్రాంతంలో ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడుతున్న పెరుగు కొండయ్య అనే స్మగ్లర్‌ను అరెస్టు చేసినట్లు డీఎఫ్‌వో గురుప్రభాకర్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా సమాచారం మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్ ఎర్రచందనం నిఘా విభాగం, కడప డివిజనల్ ఫారెస్టు ఆఫీసరు గురుప్రభాకర్ ఆధ్వర్యంలో కడప ఫారెస్టు రేంజ్ ఆఫీసరు నయీం ఆలీ, నాగరాజులతో కాపుకాచి ఖాజీపేట మండలాలం నాగసానిపల్లె గ్రామానికి చెం దిన కొండయ్యను అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ఏడు దుంగలు స్వాధీ నం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు తప్పించుకుని పారిపోయారని.. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు డీఎఫ్ఓ తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఖాజారహ్మతుల్లా, శోభారాణి, బాలచెన్నయ్య, వెంకటేశ్‌లు పాల్గొన్నారు.

కువైత్‌లో గుండెపోటుతో చంచర్లపల్లె వాసి మృతి



నాగేశ్వర (ఫైల్)

లక్కిరెడ్డిపల్లె, జూలై 16: మండలంలోని చంచర్లపల్లెకు చెందిన నాగేశ్వర (50) అనే వ్యక్తి కువైత్‌లో గుండెపోటుతో మృతి చెందినట్లు మృతుడి భార్య దేవి తెలిపారు. నాగేశ్వర బతుకుదెరువు కోసం 15 సంవత్సరాల కిందట కువైత్‌కు వెళ్లాడని సోమవారం ఉదయాన్నే కువైత్ నుంచి తన భర్త గుండెపోటుతో చనిపోయినట్లు ఫోన్ వచ్చిందని ఆమె విలపిస్తూ తెలిపింది. మృతుడు చాగలగుట్టపల్లెకు చెందిన వ్యక్తి దేవిని వివాహం చేసుకుని చంచర్లపల్లెలో స్థిరపడ్డారు. మృతుడికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. పెద్దకుమార్తెకు వివాహం కాగా చిన్నకుమార్తెకు ఆగస్టు 24వ తేదీ పెళ్లి నిశ్చయించారని మృతుడి భార్య తెలిపింది. కువైత్‌కు వెళ్లినా ఏమీ సంపాదించలేదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నా కుటుంబాన్ని ఆదుకోవాలని ఆమె కోరారు.

రేపటి నుంచి కుష్ఠు నిర్ధారణ పరీక్షలు : డీఎంఅండ్‌హెచ్‌ఓ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంఅండ్‌హెచ్ డాక్టర్ నాగరాజు

కడప(కలెక్టరేట్), జూలై 16 : జిల్లా వ్యాప్తంగా ఈనెల 18వ తేదీ నుంచి ఆగస్టు 2వ తేదీ వరకు ఇంటింటా కుష్ఠు నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం డీఎంఅండ్‌హెచ్ఓ కార్యాలయంలో కుష్ఠు, ఎయిడ్స్, టీబీ నివారణ అధికారి డాక్టర్ రవిబాబుతో కలసి పీహెచ్‌సీల వైద్యాధికారులు, ఆరోగ్య నోడల్ అధికారులకు జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డీఎంఅండ్‌హెచ్ఓ మాట్లాడుతూ జిల్లాను కుష్ఠు రహితంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పని చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ పరిధిలో జాతీయ కుష్ఠు వ్యాధి గుర్తింపు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇందులో భాగంగా ఆశా వర్కర్లు, వాలంటీర్లు, ఆరోగ్య కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి గృహాల్లో ప్రతి ఒక్కరిని పరీక్షించాలన్నారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు ఉన్న వ్యక్తులను గుర్తించి సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మెరుగైన చికిత్సకు రెఫర్ చేయాలన్నారు. వ్యాధి లక్షణాలు నిర్ధారణ అయితే మందులు ఆరు నెలల లేదా సంవత్సరం పాటు ఉచితంగా ఇస్తారన్నారు. బీసీ, ఎస్సీ ఎస్టీ వసతి గృహాల్లో ప్రతి విద్యార్థికి ఎల్‌సీడీసీ పరీక్షలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఫిజియోథెరపిస్టు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యాధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి హత్య కేసులో నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మురళీధర్

ప్రొద్దుటూరు క్రైం, జూలై 16 : వృద్ధురాలు గడ్డమీద బాలనాగమ్మ హత్య కేసులో నిందితుని బనగాని జయచంద్రుడును అరెస్టు చేసినట్లు ప్రొద్దుటూరు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. హత్య జరిగి 24 గంటలలోపే నిందితుడు జయచంద్రుడుని అరెస్టు చేసినట్లు తెలియజేశారు. వివరాల మేరకు.. బాలనాగమ్మ భర్త రామయ్య, కుమారుడు సురేష్‌తో కలిసి నేతాజీనగర్‌లో కాపురముంటున్నారు. తన కుమారుడు సురేష్ తాను ప్రేమించిన ఉష నాగమనీష గురించివారికి తెలిపాడు. ఈ వివాహం జయచంద్రుడుకు ఇష్టం లేకపోవడంతో ఆ కుటుంబంపై పగ పెంచుకున్నట్లు డీఎస్పీ వివరించారు. ఈ క్రమంలోనే సోమవారం మధ్యాహ్నం సుమారు 3.45 గంటల సమయంలో జయచంద్రుడు పెట్రోల్ బాటిల్‌తో స్వగ్రామం ఊటుకూరు నుంచి మోటారు సైకిల్‌పై ప్రొద్దుటూరుకు వచ్చాడు. నేతాజీనగర్‌లో ఉంటు న్న బాలనాగమ్మ ఇంటికి వచ్చి, అమెపై పెట్రోలు పోసి నిప్పంటించడంతో మృతి చెందిందని తెలిపారు. బాలనాగమ్మ కుమారుడు సురేష్ తన ఇష్టానికి వ్యతిరేకంగా కుమార్తెను పెళ్లి చేసుకున్నాడని, ఈ పెళ్లి బాలనాగమ్మ దగ్గరుండి చేయించినందున కక్ష కట్టి చంపిటనట్లు డీఎస్పీ తెలిపారు. ఈ క్రమంలో నిందితుడి అచూకీ కోసం ఎస్ఐ మంజునాథ్, సిబ్బందిని సికె దిన్నె మండలం ఊటూకూరు గ్రామంలోకి వెళ్లి సదరు హత్య చేసిన ముద్దాయి జయచంద్రుడుని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ శ్రీకాంత్ తెలిపినట్లు డిఎస్పీ చెప్పారు. గంటల వ్యవధిలోనే కేసు చెధించి ముద్దాయి అరెస్టు చేసిన సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్, హెడ్‌కానిస్టేబుల్స్ జగన్ నాయక్, రహంతుల్లా, జగన్నాధరెడ్డి, తిరుపాలయ్య, కానిస్టేబుళ్లను అభినందిస్తూ, వీరికి తగు రిపోర్టులకు సిఫారసు చేసినట్లు డీఎస్పీ మురళీధర్ తెలిపారు. ఈ సమావేశంలో సీఐ శ్రీకాంత్, ఎస్ఐ మంజునాథ్ సిబ్బంది పాల్గొన్నారు.

కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీలో అతిసార

ఒకే కుటుంబంలో ఆరుగురు బాధితులు



వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సపొందుతున్న బాధితులు

వేంపల్లె, జూలై 16: మండలంలోని కుమ్మరాంపల్లె ఎస్టీ కాలనీలో అతిసారంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పదిరోజుల వ్యవధిలో ఒకే కుటుంబంలో ఆరుగురు అతిసారకు గురై ఆసుపత్రి పాలయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడుతూ ఆసుపత్రిలో ఆ కుటుంబం చికిత్స పొందుతోంది. ఆ గ్రామంలో ఇతరులు అతిసారకు గురయ్యారు. మండలంలో చుట్టుపక్కల గ్రామాల నుంచి వేంపల్లె వైద్యశాలకు అతిసారతో బాధపడుతున్న రోగులు వస్తుండడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. వైద్యఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

పేదల భూములకు భద్రత కల్పించండి : ఆర్డీవో

అట్లూరు, జూలై 16 : మండలంలోని నల్లాయపల్లె రెవెన్యూ గ్రామ పొలంలోని సర్వే నెం.180, 102, 41లలో ముంపు గ్రామాలైన పాటిమీదపల్లె, మలినేనిపట్నం గ్రామ స్తులకు 28 మందికి 42 ఎకరాలు పట్టాలు ఇచ్చారు. ఈ భూములను సాగు చేసుకుంటుండగా బద్వేలు మండలం గొడుగునూరు బోయినపల్లె వైసీపీ నేత శివరాంరెడ్డి, రవికుమార్‌రెడ్డిలు మరికొందరు మమ్మల్ని అడ్డుకుంటూ మాపై దాడి చేసేందుకు వచ్చారని రెవెన్యూ అధికారులకు పలమార్లు ఫిర్యాదు చేసినా.. పటించుకోకపోవడంతో సోమవారం కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు బద్వేలు ఆర్డీవో చంద్రమోమన్ మంగళవారం నల్లాయపల్లె భూములను పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం సర్వే చేసి పట్టాదారులకు భద్రత కల్పించాలని తహసీల్దారు వేణుగోపాల్, డిప్యూటీ తహసీల్దారు రవిశంకర్, మండల సర్వేయరు శ్రీనివాసులుకు ఆదేశించారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడితే వారికి నోటీసులు ఇచ్చి కేసులు నమోదు చేయాలని రెవె న్యూ అధికారులకు, ఎస్ఐ కేసీరాజుకు ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కరీముల్లా, సర్వేయర్లు వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

435 నిమ్మ చెట్లను నరికివేసిన వైసీపీ నేత



పొలంలో నరికిన నిమ్మచెట్లను చూపుతున్న బాధితులు

రాజంపేట టౌన్, జూలై 16 : రాజంపేట మండలం పోలి గ్రామ పంచాయతీలో వైసీపీ నాయకుడు పోలి చంద్రారెడ్డి కొంతమందితో కలిసి సోమవారం రాత్రి తోటలో ప్రవేశించి 435 నిమ్మచెట్లను నరికివేశారు. వివరాల్లోకి వెళితే... మునక్కాయల మంజుల 8 సంవత్సరాల నుంచి నిమ్మతోటను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. పోలి చంద్రారెడ్డి అనే వైసీపీ నాయకుడు పోలి పంచాయతీలోని సర్వేనెంబరు 1033/3 నెంబరులో ఉన్న ఐదెకరాల పొలం తనదంటూ తప్పుడు పత్రాలు సృష్టించి రెండు సంవత్సరాల నుంచి ఆ భూమి తనదంటూ దౌర్జన్యం చేయడంతో పాటు అనేకసార్లు తమపై దాడికి కూడా పాల్పడ్డారని బాధితురాలు తెలిపారు. దీనిపై కోర్టులో సమస్య ఉన్నప్పటికీ తమపై దౌర్జన్యం చేస్తున్నాడని తెలిపింది. సోమవారం రాత్రి ఎవరూ లేని సమయంలో చంద్రారెడ్డి కొంతమంది మనుషులతో కలిసి రెండు సంవత్సరాల వయస్సు ఉన్న నిమ్మ చెట్లను నరికివేశాడని, ఉదయం తోటలోకి వెళ్లి చూసి రాజంపేట రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంఘటనా స్థలాన్ని మన్నూరు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

పందుల స్వైరవిహారం.. బెంబేలెత్తుతున్న జనం


చెన్నూరు వనంవీధిలో ఇళ్ల వద్దే ఉన్న పందులు

చెన్నూరు, జూలై 16: మేజర్ పంచాయతీ చెన్నూరులో పందుల స్వైర విహారంతో జనం బెంబేలెత్తుతున్నారు. ఎవరూ పట్టించుకోకపోవడంతో అవి పంచాయతీలోని వీధుల్లో, వ్యవసాయ పొలాల్లో ఇష్టానుసారంగా సంచరిస్తున్నాయి. ఫలితంగా ప్రజలకు రోగాలు, రైతులకు నష్టా లు వాటి ల్లుతున్నాయి. ఎన్నో ఏళ్లుగా చెన్నూరు పంచాయతీలో పందుల పెం పకం చేపడుతున్నారు. గతంలో వాటి వల్ల మెదడువాపు, ఇతర వ్యాధులు వస్తున్నాయని పంచాయతీ అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. వారు తాత్కాలిక పరిష్కారం చూపుతున్నారేగాని పందులను పూర్తి స్థాయిలో బయటికి తరలించడం లేదు. దీంతో వాటి సంతతి రోజురోజుకూ పెరిగి ఇటీవల ఏ వీధిలో చూసినా వాటి గుంపు కనిపిస్తోంది. పట్టపగలే ఇళ్లలోకి జొరబడటం, వీధుల్లో చిన్నపాటి నీరు కనిపించినా అక్కడ పొర్లాడడం, ఆ మురికిని ప్రజలకు రాసుకుంటూ వెళ్లడం, అవి ఉన్న చోట దోమల సంచారం ఎక్కువగా ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఇటీవల వ్యవసాయ పొలాల్లో వరి సాగు చేపట్టే రైతులు నారు మళ్లు పోసుకోవడంతో వాటిలో కూడా పందులు వెళ్లి ఆ మడులను నాశనం చేస్తున్నాయి. నారు కోసం చల్లిన వడ్లను తినడం, అంతో ఇంతో పెరిగిన నారుమళ్లలో ఇష్టానుసారంగా పొర్లాడడం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. నారుమళ్లు పోసిన ప్రతి చోటా గుంపులుగా కనిపిస్తున్నాయి. పగలు వరకు రైతులు కాపాడుకున్నా రాత్రివేళల్లో మాత్రం అవి ఎక్కువ సంఖ్యలో వెళ్లి నారుమళ్లను నాశనం చేస్తున్నాయి. దీంతో రైతులు సైతం పంచాయతీ సిబ్బందికి ఫిర్యాదు చేస్తున్నారు. ముఖ్యంగా చెన్నూరు కొత్త గాంధీనగర్, అరుంధతీనగర్, సుగాలికాలనీ బెస్తకాలనీ, లక్ష్మీనగర్, సరస్వతీనగర్, శివాలయం వీధి తగ్గు ప్రాంతం, పార్కు వీధి, మైనారిటీ కాలనీల్లో వీటి సంచారం గుంపులుగా ఉంటోంది. అంతేగాకుండా స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలోకి సైతం పందులు రావడంతో అక్కడి సిబ్బందికి సమస్యగా మారింది.

పందులన్నింటిని దూరంగా తరలిస్తాం



పంచాయతీలో పందుల సంచారం ఎక్కువగా ఉన్న మాట వాస్తవమే. చాలాసార్లు వాటిని పట్టుకున్నాం. పందుల పెంపకందారులను పిలిచి పోలీసుల ద్వారా చెప్పించాం. అయినప్పటికీ వారి తీరు మారడంలేదు. ఇకపై ఉపేక్షించేది లేదు. ఒక్క పంది కనిపించినా వాటిని ఇతర ప్రాంతాల్లో కాకుండా ఇతర రాష్ట్రాలకు తరలించేలా చూస్తాం. పందుల పెంపంకదారులు వారే సొంతంగా తరలిస్తే మంచిది. లేకపోతే ఏ ఒక్కటీ వదలకుండా పట్టుకుని సుదూర ప్రాంతాలకు తరలిస్తాం.

- రామసుబ్బారెడ్డి, పంచాయతీ కార్యదర్శి, చెన్నూరు

మధుసూదన్ ఆరోపణలపై విజయసాయిరెడ్డి సమాధానం చెప్పాలి

- దమ్ముంటే డీఎన్ఏ పరీక్షకు సిద్ధం కావాలి
- టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న గోవర్ధనరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 16 : ఎస్టీ మహిళ భర్త మధుసూదన్ ఆరోపణలపై వైసీపీ నేత విజయసాయిరెడ్డి సమాధానం చెప్పాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.గోవర్ధన రెడ్డి డిమాండ్ చేశారు. ఈ విషయమై మీడియా ప్రతినిధులు, టీడీపీ నేతలపై సభ్యతా సంస్కారం లేకుండా మాట్లాడడం దుర్మార్గమన్నారు. విజయసాయికి దమ్ముంటే డీఎన్ఏ పరీక్షకు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. మంగళవారం తన కార్యాలయంలో గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి వీధిరౌడీలా మీడియా ప్రతినిధులు, మీడియా ఎండీలు, టీడీపీ నేతలపై దుర్భాషలాడడం హేయమైన చర్య అన్నారు. ఎస్టీ మహిళ భర్త మధుసూదన్ విజయసాయిరెడ్డిపై చేసిన ఆరోపణలకు సమాధానం చెప్పకుండా టీడీపీ నేతలు, మీడియా ప్రతినిధులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడటం ఏమిటని ప్రశ్నిం చారు. వైజాగ్‌లో ఒక అమ్మాయి పేరు మీద విల్లా కొన్నావు, ఆ అమ్మాయి ఎవరు అని ప్రశ్నించారు. అలాగే విదేశాలకు చాలాసార్లు వెళ్లావు, ఎంత మంది అమ్మాయిలను తీసుకెళ్లావో చెప్పాలన్నారు. కూటమి ప్రభుత్వంపై మాట్లాడడం సరైన పద్ధతి కాదని, వైజాగ్‌లో భూదందాలు, దోపిడీలు బయటికి వస్తున్నాయని పేర్కొన్నారు. మీ లొసుగులతో కూటమికి ఇబ్బంది పెట్టాలనుకోవడం మంచి పద్ధతికాదన్నారు. అలాగే విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మధ్యంతర ఎన్నికలు వస్తాయని, చంద్రబాబు ప్రభుత్వం కూలిపోతుందని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గాలిలో వచ్చిన పార్టీలు గాలిలోనే కలిసిపోతాయన్నారు. చంద్రబాబు ఒక్కో హామీ నెరవేరుస్తూ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తారన్నారు. బడుగు, బలహీన వర్గాల పార్టీ టీ డీపీ అని, ప్రజలెప్పుడూ టీడీపీ వెంటే ఉంటారన్నారు. ప్రజలను ఇబ్బందులపాలు చేసిన వారు, అలాగే భూదందాలు, దోపిడీలు చేసిన వారందరికీ జైలు జీవితం తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ గురప్ప తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదును ఉన్నతాధికారులకు నివేదిస్తా

- డీసీహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి


టీడీపీ నేతలతో మాట్లాడుతున్న డీసీహెచ్ఎస్ హిమదేవి

చెన్నూరు, జూలై 16 : చెన్నూరులో దాదాపు నాలుగున్నర కోట్ల రూపాయలకు పైగా వెచ్చించి నిర్మించిన భవనం నాసిరకంగా ఉందని, టీడీపీ నేతలు చేసిన ఫిర్యాదును తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని జిల్లా వైద్యసేవల సమన్వయ అధికారి డాక్టర్ హిమదేవి అన్నారు. మంగళవారం ఆమె చెన్నూరు సీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో మందులు ఏ మేరకు ఉన్నాయి, ఓపీ, అడ్మిషన్లు అందే వైద్యసేవలు ఇతరత్రా వైద్యపరికరాలు విషయంపై అక్కడి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ టీడీపీ నేతలు మల్లిఖార్జున రెడ్డి, ఆకుల ప్రసాద్‌బాబు, షబ్బీర్ హుసేన్, శివారెడ్డి డీసీహెచ్ఎస్‌తో మాట్లాడారు. గతంలో ఉన్న భవనంపై మిగిలి ఉన్న పిల్లర్లలో ఉన్న కడ్డీలు దెబ్బతిని ఉంటే వాటిపైనే మళ్లీ పిల్లర్లు వేశారన్నారు. దీంతో ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. నాలుగున్నర కోట్లకు పైగా నిధులు వెచ్చించినా భవనం పనులు అధ్వానంగా చేపట్టడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లామన్నారు. డీసీహెచ్ఎస్ మాట్లాడుతూ ఫిర్యాదులను తాను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానన్నారు.

ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలి: ఎస్టీఎఫ్


వినతిపత్రం అందిస్తున్న ఎస్టీఎఫ్ ప్రతినిధులు

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 16 : పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ఎ స్టీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామచంద్ర డిమాండ్ చేశా రు. మంగళవారం డీఈ ఓ కార్యాయలంలో డీఈ ఓ అనురాధకు వినతిపత్రం అందించారు. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేని కారణంగా విద్యార్థులకు సరైన బోధన అందం లేదన్నారు. చాలామంది ఉపాధ్యాయులు పదవీ విరమణ పొందిన కారణంగా కొరత వెంటాడుతోందని, సత్వరమే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాలని కోరారు. పాఠశాలల్లో కొత్తగా చేరిన విద్యార్థుల వివరాలు అటెండెన్స్ యాప్‌లో రాకపోవడం వల్ల మధ్యాహ్న భోజన పథకంలో వారి వివరాలు చూపించడంలేదని సవరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఎఫ్ నాయకులు బాలక్రిష్ణ, శ్రీరామ్, సలాం, ఎల్‌వీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 16 :సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ గత రెండు నెలలు జీతాలు వెంటనే చెల్లించాలని యూటీ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేశ్‌బాబు డిమాండ్ చేశారు. మంగళవారం డీఈఓ కార్యాలయంలో ఏడీ మునీర్ ఖాన్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎంఈఓ కార్యాలయాల్లో పనిచేస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులకు మే, జూన్ నెలలకు సంబంధించిన రెండు నెలల వేతనాలు ప్రభుత్వం చెల్లించలేదని దీని ద్వారా అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణం వారి జీతాలను వారి ఖాతాల్లో జమ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు నరసింహారావు, సీవీ రమణ, ఎజాజ్ అహ్మద్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు


వేంపల్లెలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


కమలాపురంలో ఊరేగుతున్న పీర్లు

కమలాపురం రూరల్, జూలై 16 : పట్టణపరిధిలోని కె.అప్పాయపల్లె, సి.గోపులాపురం గ్రామాల్లో మొహర్రం వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం తెల్లవారుజామున పీర్ల ఊరేగింపు నిర్వహించారు. దాదాపు వారం రోజుల క్రితం పట్టణంలోని కుళాయిస్వామి దర్గా, బీడీ కాలనీ, అప్పాయపల్లె, సి.గోపులాపురం, పెద్దచెప్పలి, చిన్నచెప్పలి, విభరాపురం గ్రామాల్లో వెలసిన పీర్ల మకాన్లను దర్గాల్లో కొలువుదీర్చారు. పీర్లను గ్రామాల్లో వైభవంగా ఊరేగిస్తామని నిర్వాహకులు తెలిపారు. సి.గోపులాపురంలో, అప్పాయపల్లెలో మంగళవారం తెల్లవారుజామున పీర్లను ఊరేగించారు. సి.గోపులాపురంలో ఎస్‌కే బాషా, రమణారెడ్డి, బాబాఫకృద్దీన్ సహకారంతో ఊరేగింపు అనంతరం అన్నదానం చేశారు.

వేంపల్లెలో వేడుకగా పీర్ల ఊరేగింపు

వేంపల్లె, జూలై 16: పట్టణ పురవీధుల్లో పీర్లను ఊరేగించారు. మేళతాళాలతో ఈ ఊరేగింపు జరిగింది. ప్రజలు పీర్లను దర్శించుకొన్నారు. చింతలమడుగుపల్లె దర్గాలో పీర్ల పండుగ ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆంగ్ల విభాగంలో డాక్టరేట్ ప్రదానం


దస్తగిరి

కడప (ఎర్రముక్కపల్లె), జూలై 16 : వైవీయూ ఆంగ్ల శాఖ పరిశోధకులు బండిశూల దస్తగిరికి వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. వైవీయూ ఆంగ్ల విభాగం అసిస్టెంటు ప్రొఫెసర్ డాక్టర్ ఎన్.అంకన్న పర్యవేక్షణలో అరుంధతీరాయిస్ సెలెక్ట్ వర్క్స్ ఏ స్టడీ అనే అంశంపై ఈయన చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి తెలిపారు. దస్తగిరి రాసిన పరిశోధన వ్యాసాలు పలు జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. జాతీయ సదస్సులో పరిశోధన పత్రాలు సమర్పించారు. పరిశోధకులు దస్తగిరి వీఎన్‌పల్లె మండలం పాయసంపల్లె గ్రామానికి చెందినవాడు. ఈయన విద్యార్థి సంఘ ప్రతినిధిగా కూడా అనుభవం ఉంది.

వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించండి

వేంపల్లె,జూలై 16: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు దోమల వల్ల ప్రబలే వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని జిల్లా మలేరియా అధికారి మనోరమ సూచించారు. మండలంలోని తాళ్లపల్లె పీ హెచ్‌సీలో సిబ్బందికి సమావే శం నిర్వహించారు. వాయధు ల గురించి మరియ వేక్టర్ కంట్రోల్, ప్రతి సోమవారం నుంచి బుధవారం వరకు అలాగే ఫ్రైడే-డ్రైడే శుక్రవారం నుంచి ఆదివారం వరక్రుపతి ఆరోగ్య కార్యకర్త నిర్వహించాలన్నారు. సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, జిల్లా మలేరియా ఆఫీస్ ఎంపీహెచ్‌ఈఓ శంకర్‌రెడ్డి, సీహెచ్‌ఓ వెంకటరత్నం, ఎపీహెచ్‌ఈఓ బాబా ఫకృద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీలు ఆరోగ్య కార్యకర్తలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో చోరీ

పులివెందుల టౌన్, జూలై 16:చెన్నారెడ్డి కాలనీలో విశ్వనాథరెడ్డి అనే టీచర్ ఇంట్లో పది తులాల బంగారు, నగదు దొంగలు దోచుకెళ్లారు. ఇటీవల వీరు కడపకు వెళ్లడంతో ఇంట్లో ఎవరు లేని సంగతిని పసిగట్టిన దొంగలు చోరీకి పాల్పడ్డారని బాధితులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గమ్మ సన్నిధిలో కాల సర్పదోష నివారణ పూజలు



విజయదుర్గాదేవి అమ్మవారు... అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న మహిళా భక్తులు

కడప (కల్చరల్), జూలై 16: విజయదుర్గాదేవి ఆలయంలో మంగళవారం కాలసర్ప దోష నివారణ పూజలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి అమ్మవారి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మలగన్న అమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ దుర్గమ్మ సన్నిధిలో నిమ్మకాయలతో కూడిన రాహుకాల పూజలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాగా ఈనెల 21న ఆదివారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అభిషేకం, చండీహోమం, మండల దీక్షాదారుల మాల విరమణ, తదితర కా ర్యక్రమాలు చేపడుతున్నట్లు ఆలయ వ్యవస్థాపకు డు మల్లికార్జున రావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

సీకేదిన్నె, జూలై 16: రోడ్డు ప్రమాదంలో మాచనూరుకు చెందిన వెంకటస్వామి అనే వ్యక్తికి గాయాలైనట్లు సీకెదిన్నె పోలీసులు తెలిపారు. వారు అందించిన వివరాల మేరకు పెండ్లిమర్రి మండలం మాచనూరుకు చెందిన వెంకటస్వామి సొంత పని నిమిత్తం కడపకు వచ్చి మంగళవారం పని ముగించుకుని తిరిగి వెళుతుండగా చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల పంచాయతీ రోడ్డుక్రిష్ణాపురం సమీపంలో వెనుకవైపు నుండి బొలేరో వాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగిందన్నారు. ఈ ప్రమాదంలో వెంకటస్వామి కాళ్లకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఆక్రమణల తొలగింపునకు సర్వే


సర్వే చేపడుతున్న సర్వేయరు సోమశేఖర్

చెన్నూరు, జూలై 16 : ఇకపై కడప నుంచి చెన్నూరు మీదుగా ప్రొద్దుటూరుకు బస్సుల రాకపోకలకు మార్గం సుగమనం కానుంది.ఎంతోకాలంగా చెన్నూరు క్రాసింగ్ (గోసుల కల్యాణ మండపం) నుంచి కొండపేట వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఆక్రమించుకున్న పుట్‌పాత్, ఇతరత్రా ఆక్రమణలను తొలగించేందుకు సర్వేయరు సోమశేఖర్ ఆధ్వర్యంలో మంగళవారం సర్వే చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీధర్ ఆధ్వర్యంలో సర్వే చేపట్టారు. అలాగే తహసీల్దారు ప్రకాశ్‌బాబు ఒకటి, రెండు రోజుల్లో సర్వే చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు వెంకటశివారెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు, ఇతర సర్వేయర్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అంకితభావం అవసరం

- సీహెచ్‌సీ సమావేశంలో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి


మాట్లాడుతున్న విజయభాస్కర్‌రెడ్డి

చెన్నూరు, జూలై 16: విధి నిర్వహణలో అంకితభావం అవసరమని టీడీపీ మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, వైద్యసిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. వైద్యుడిని కనిపించే దేవుడు అంటారని, విధుల పట్ల అంకితభావం, ఏ సమయంలో పిలిచినా పలికే గుణం, ఆసుపత్రికి వచ్చిన ప్రతి రోగినీ ప్రేమతో పలుకరించి వైద్యం అందించడం వైద్యుడి బాధ్యత అన్నారు. వైద్యపరికరాలు లేకున్నా, ఏదైనా అవసరం ఉన్నా, సిబ్బంది కొరత ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే ఎమ్మెల్యే ద్వారా ఆ అవసరం తీరుస్తానన్నారు. ఉచిత అంబులెన్స్‌ను ఉపయోగించాలని కోరారు. సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సతీష్ మాట్లాడుతూ జూనియర్ అసిస్టెంటు, ఒక స్టాఫ్ నర్సు తక్కువగా ఉన్నారని సిబ్బంది కొరత ఏమీ లేదని తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఇందిరెడ్డి శివారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి మల్లిఖార్జున రెడ్డి, జిల్లా మైనార్టీ నేత షబ్బీర్‌హుసేన్, టీడీపీ సీనియర్ నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్

లింగాల, జూలై 16: లింగాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం 19 మంది హైరిస్క్ గర్భిణులకు స్కానింగ్ నిర్వహించినట్లు డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొయినుద్దీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పిండం పెరుగుదల, ఆరోగ్య స్థితిగతులను తెలుసుకొని మం దులు, ఇతర ఆరోగ్య సేవలనుసకాలంలో అందించేందుకు వీలు కలుగుతుందన్నారు. ఈ ప్రక్రియ ప్రతినెల 9 నుంచి 10వ తేదీలలో ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ జరుగుతుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ శరణ్య, మెడికల్ ఆఫీసర్ డాక్టర్‌కళ్యాణ్ దినకర్, సీహెచ్‌ఓ శివరామ్, సూపర్వైజర్ హాసియాబేగం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎమ్‌లు, ఆశా కార్యకర్తలుపాల్గొన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి

చక్రాయపేట, జూలై 16: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని బీసీ సంక్షేమ శాఖ ఉపసంచాలకులు సరస్వతమ్మ పేర్కొన్నారు. ఆమె మంగళవారం చక్రాయపేటలో రూ.1.60 కోట్లతోనిర్మించిన నూతన బీసీ హాస్టల్‌ను ప్రారంభించారు. అనంతరం బీసీ హాస్టల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ తల్లిదండ్రులను దృష్టిలో ఉంచుకొని, ఇంటి పరిస్థితులను బట్టి చదివితే తప్పక ఉన్నత శిఖరాలు చేరుకుంటారన్నారు.

బాలిక ఆత్మహత్య

కడప (క్రైం), జూల్ 16:కడప నగరం చంద్రమౌళి నగర్‌కు చెందిన బాలిక(15) చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. ఆ బాలిక గాంధీనగర్ ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

బోగస్ పింఛన్లపై ఎమ్మెల్సీ ఫిర్యాదు


మంత్రితో మాట్లాడుతున్న రామగోపాల్‌రెడ్డి

పులివెందుల టౌన్, జూలై 16: పులివెందుల నియోజకవర్గంలోని బోగస్ పింఛన్లపై ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఎంఎస్ఎమ్ఈ, సెర్ప్ మంత్రి కొండపల్లె శ్రీనివాస్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సోమేశ్వరపురంలో రోడ్డుపై నిలిచిన నీటిని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో నాగరాజు

అట్లూరు, జూలై 16 : మండలంలోని గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అట్లూరు వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో నాగరాజు సూచించారు. మంగళవారం ఆయన అట్లూరు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం సోమేశ్వరపురం గ్రామంలో రోడ్డుపై నిలిచిన నీటి నిల్వలను పరిశీలించారు. నీటి నిల్వ ఉండడంపై దోమలు, కీటకాలు పెరిగి మలేరియా, డెంగ్యూ వ్యాధులు వస్తాయనిసూచించారు. అనంతరం డెంగ్యూపై సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అమితాబేగం, మాధురి, కమ్యూనిటీ హెల్త్‌అధికారి మురళి, వెంకటరెడ్డి, లక్ష్మీదేవి, వైద్యసిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైద్యాధికారి సంపత్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండలంలోని గురుకుల పాఠశాలలో అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. కళాశాల ప్రిన్సిపల్ పద్మనాభమూర్తి, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: జిల్లాలో సీజనల్ వ్యాధులు డయేరియా ప్రబలుతున్నందున వసతి గృహ విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని టీఎన్‌ఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు చేతన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం టీఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు నడింపల్లెలోని ఆనందనిలయం వసతి గృహాల సముదాయంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్లు నాగరాజు, బ్రహ్మం, టీఎన్‌ఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షులు రాజేష్, జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 16: గోపవరం పంచాయతీ పరిధిలో ఉన్న ఆచార్ల కాలనీ, శ్రీనివాసపురం, ద్వారకానగర్ ప్రాంతాల్లో దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు పేర్కొన్నారు. మంగళవారం వారు గోపవరం పంచాయతీ కార్యదర్శి రామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసాచారి, నాగరాజు ఆచారి, భాస్కర్‌రెడ్డి, శ్రీను, సుధాకర్‌యాదవ్, కృష్ణయాదవ్ పాల్గొన్నారు.

కాలువలో ఆక్రమణలు, పూడిక తొలగించాలి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 16: స్థానిక 25వ వార్డులో ఉన్న మురుగు కాలువలో ఆక్రమణలు, పూడిక తొలగించి రక్షణ గోడ నిర్మించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎండీ నజీర్ మంగళవారం మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామేశ్వరం నుంచి కొత్తపల్లెకు వెళ్లే మురుగు కాలువ 25వ వార్డులో ఆక్రమణలకు గురైందని తెలిపారు. త్వరలోనే ఆక్రమణలు తొలగించి కాలువలో పూడిక తీయడానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చినట్లు పీఎండీ నజీర్ తెలిపారు.

ఈ సమస్యకు పరిష్కారం లేదా..?

- వీధి కుళాయి, ఇళ్లల్లోని మురుగునీరు మెయిన్ బజార్లలోకి వదులుతున్న స్థానికులు
- కంపుకొడుతున్న వీధులు
- పడకేసిన పారిశుధ్యం
- వ్యాధులతో భయాందోళనలో ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు

రాజుపాలెం, జూలై 16 : నెలరోజులుగా అరకొర వర్షాలు, దానికి తోడు వీధి కుళాయి నీరు, ఇళ్లల్లోని మురుగునీరు బజార్లలో చేరడంతో గ్రామీణ ప్రాంతాలు కంపు, కంపుగా మారాయి. నీళ్లన్నీ నిల్వ చేరి వాహనాలు రద్దీతో నల్లగా రంగు మారడంతో భరించరాని కంపు కొడుతున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం లేదా అని ప్రజలు మథనపడుతున్నారు. అసలే సీజన్ వ్యాధులు మొదలడంతో ఇలా ఉంటే డెంగ్యూ, మలేరియా సోకవా అని ప్రజలు ఆందోళన పడుతున్నారు. రాజుపాలెంలోని పెట్రోలు బంకుకు పోయే దారి, మెయిన్‌బజారు, అర్కటవేములలోని ఎస్సీ కాలనీకి వెళ్లే దారి, తొండలదిన్నెలోని మెయిన్ బజారు, అయ్యవారుపల్లెలోని మెయిన్ బజారులోని డ్రైనేజీ కాల్వ, టంగు టూరు గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీలలో మురుగునీరు ఇళ్ల మధ్యలోనే నిలిచి అధ్వానంగా తయారైంది. ప్రజలు నడవలేని స్థితిలో ఈ దారులు మురుగు గుంటలుగా ఏర్పడ్డాయి. వీటిని తొలగించేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. రాజుపాలెం, టంగుటూరు తదితర గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు ఉన్నా వారు కొన్ని బజార్లకే పరిమితం కావడంతో మిగతా వీధుల్లో మట్టికుప్పలు, మురుగుకుంటలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అంతేగాక స్థానికులు ఇళ్లల్లోని మురుగునీరు వీధుల్లోకి వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. అంతేగాక కొంత మంది నిర్లక్ష్యంగా మురుగునీరంతా బజార్లలో వదలడం, పబ్లిక్ కుళాయిలకు ట్యాప్‌లు సరిగా లేకపోవడం, పశువులను రోడ్లపై వదలడం కూడా ఇందుకు ప్రధానకారణమవుతున్నాయి. వీటన్నింటిపై దృష్టి పెట్టి అధికారులు ప్రతి వీధుల్లో తిరిగి వీటిని క్రమబద్ధీకరణ చేయడంతో పాటు పారిశుధ్య కార్యక్రమాలు చేసి బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.



రాజుపాలెంలోని పెట్రోలుబంకు దారిలో నిలిచిన మురుగునీరు



రాజుపాలెంలోని మెయిన్‌బజారులో నిలిచిన మురుగునీరు



అయ్యవారుపల్లెలో దోమలకు నిలయంగా మారిన మురుగుగుంత



టంగుటూరు బీసీ కాలనీలో నిలిచిన మురుగునీరు

పారిశుధ్యలోపం ... సీజనల్ వ్యాధులు తథ్యం

మైదుకూరు రూరల్ జూలై 16 : మైదుకూరు మున్సిపాలిటీలో వాతావరణం మార్పు కారణంగా సీజనల్ వ్యాధులు అక్కడక్కడ ప్రజలను పట్టిపీడిస్తున్నాయి. మున్సిపాలిటీలో సిబ్బంది రోజువారి పనులుగా చెత్తను ఎత్తడం,రోడ్లు ఊడ్చడం తప్ప మరేపనిని చేయడం లేదంటు ప్రజలు చెబుతున్నారు. కుండీల వద్ద చెత్తను అసంపూర్తిగా తీస్తున్నారు.దీంతో అక్కడ దోమలు,ఈగలు విపరీతంగా చేరి వ్యాధులు వస్తున్నాయి. చెత్త తీసిన తరువాత బ్లీచింగ్ పౌడర్ లాంటివి చల్లితే వ్యాధులను కొంత వరకు రాకుండా నివారించవచ్చునని ప్రజలు కోరుతున్నారు.అంతేకాకుండా కొన్ని వీధులలో మురుగునీరు నిలబడి దోమలు వ్యాప్తి చెందుతున్నాయి అక్కడ వైద్య సిబ్బంది ఆయిల్‌బాల్స్ వేయడం లాంటి పారిశుధ్య చర్యలు శూన్యమని ప్రజలు వాపోతున్నారు.సీజనల్ వ్యాధులు ప్రభలే రోజులలో కూడా మున్సిపల్ ,వైద్య సిబ్బంది అప్రమత్తమై వెంటనే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



చెత్తచెదారాలతో నిండిన సర్వాయపల్లె రోడ్డు



ప్లాస్టిక్ విక్రయాలను ఉపేక్షించేది లేదు

ప్రొద్దుటూరు, జూలై 16 : ప్రొద్దుటూరులో ప్లాస్టిక్ విక్రయాలను ఉపేక్షించేది లేదని కమిషనర్ రఘునాథరెడ్డి స్పష్టంచేశారు. మంగళవారం కోనేటి కాల్వ వీధిలోని ప్లాస్టిక్ విక్రయాలు జరుపుతున్న కిరాణా దుకాణంపై దాడులు చేసి ప్లాస్టిక్ వస్తువులు సీజ్ చేశారు. 20 వేలు జరిమానా విధించారు. ఈ దాడుల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌బాషాతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

దళితులపై జరుగుతున్న దాడులను ఆపాలి

బద్వేలు, జూలై 16: దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని సీపీఎం పార్టీ కార్యదర్శి వర్గ సభ్యుడు చాంద్‌బాష పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట మండలం పెన్నపేరూరు గ్రామంలో కదిరి ప్రభాకర్‌పై వేడినూనెను పోసి గాయపరిచిన వెంకటసుబ్బారెడ్డిపై చర్యలు చేపట్టాలన్నారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు రమణయ్య, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు : ఆర్డీవో

కొండాపురం, జూలై 16 మండలంలో నీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోనున్నట్లు జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని కొండాపురం,తాళ్లప్రొద్దుటూరు, దత్తాపురం, ఓబన్నపేట, గండ్లూరు తదితర గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. మండలంలోని పలు గ్రామాల్లో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఇటీవల జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి కొండాపురంలో అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో నీటి సమస్యను పరిష్కరించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలిసి పర్యటించారు. చిత్రావతి నది నుంచి పైపులైను, ఇతర మార్గాల ద్వారా నీటిని తరలించేందుకు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో చర్చించారు. ఎంపీడీవో నాగప్రసాద్, తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ ఆనందరావు ,ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాస్

పీర్లకు ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 16: మొహర్రం పర్వదినం సందర్భంగా పీర్లను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుందరాచార్యుల వీధిలోని పీర్లచావిడిలో పీర్లను కొలువుదీర్చి పూజలు చేశారు. పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లింలతోపాటు హిందువులు పీర్లను దర్శించి చెక్కర చదివింపులు చేశారు. నడింపల్లెలో పీర్లచావిడిలో పీర్లను కొలువుదీర్చి పూజలు చేశారు.

కొండాపురం..: మండలంలో పలు చోట్ల మొహరాం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని చౌటిపల్లె గ్రామంలో పీర్లచావిడి వద్ద మంగళవారం రాత్రి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి పీర్లతో అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు.కాగా బుధవారం పీర్లను ఏటికి తీసుకెళ్లనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

పోరుమామిళ్ల..: మొహర్రం వేడుకలు పురస్కరించుకుని పోరుమామిళ్లలో పెద్దసరిగెత్ వేడుకలు నిర్వహించారు, మంగళవారం పోరుమామిళ్లలోని హుసేన్‌పీర్ దర్గా వద్ద ఉన్న పీర్ల చావిడి, ఉద్దికట్ల వీధిలో ఉన్న పీర్ల చావిడి, ముస్లింకోటవీధిలో ఉన్న పీర్ల చావిడి, టేకూరుపేటలో ఉన్న పీర్ల చావిడిలో కొలువుదీరిన పీర్లకు హిందూ ముస్లింలు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్ల కొత్తవీధికి చెందిన అబ్దుల్లా అనే కార్పెంటర్ కీలు గుర్రం వేషం వేసుకుని తన విన్యాసాలతో పట్టణ ప్రజలను అలరించారు. రాత్రి పీర్లచావిడి ఎదురుగా ఏర్పాటు చేసిన గుండాల్లో భక్తులు, నిర్వాహకులు తీసుకువచ్చిన పెద్ద పెద్ద మొద్దులకు నిప్పంటించారు. నింగికి ఎగిసేంత ఎత్తులో మంటలు రేగడంతో ఈ దృశ్యాన్ని తిలకించేందుకు ప్రజలు, భక్తులు గుమికూడారు.



పోరుమామిళ్లలో పీర్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

పార్కింగ్ లేక ఇక్కట్లు

జమ్మలమడుగు, జూలై 16: జమ్మలమడుగులో పోలీసు అధికారులు, సిబ్బంది స్టేషన్‌కు పరిమితం కాకుండా పట్టణంలోని ట్రాఫిక్‌ను పరిశీలించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. పాత బస్టాండులోని మున్సిపల్ మస్టర్‌పాయింట్ ఎదురుగా పక్కనే వాటర్ ప్లాంట్ ఎదురుగా రోడ్డుకు అడ్డంగా ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిపి ఉన్నారు. మరికొందరు వ్యాపారులు దారికి అడ్డంగా కూర్చొని ఉన్నారు. కొందరు నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాలు నిలుపుకుని మస్టర్‌పాయింట్ నుంచి పారిశుధ్య వాహనాలు , సిబ్బంది రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు.



మస్టర్‌పాయింట్, వాటర్‌ప్లాంట్ ఎదురుగా నిలిపిన ఆటోలు

● 108 వాహనానికి తీవ్ర అడ్డంకులు

పాత బస్టాండులోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద రూరల్ పోలీసు స్టేషన్ ఆవరణలోకి 108 వాహనం వెళ్లాలన్నా ఇబ్బందిగా మారింది. కార్యాలయానికి రిజిస్ట్రర్లకోసం వచ్చే ప్రజలు ద్విచక్ర వాహనాలు ఇరువైపులా నిలిపి ఉండడం వలన రాకపోకలకు ఇబ్బందిగా మారింది. తహసీల్దారు కార్యాలయ అధికారులు కూడా పాత పోలీసు స్టేషన్ ఆవరణం నుంచి రావాల్సి ఉంది. తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ప్రహరీ నిర్మించకుండా సిమెంటు దిమ్మెలు మాత్రం ఉన్నాయి. దీంతో ఆ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఇబ్బందిగా మారింది. అలాగే 108 వాహనం వెళ్లాలంటే వాహన సిబ్బంది తీవ్ర ఇక్కట్లకు గురవుతున్నారు. పట్టణంలోని అర్బన్ పోలీసులు లేదా రూరల్ పోలీసు స్టేషన్ సిబ్బంది కూడా రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా వాహనాలు నిలుపకుండా వారందరికీ పార్కింగ్ సౌకర్యం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ సమస్యలకు అధికారులు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది. పట్టణంలోని ట్రాఫిక్ విషయంలో పోలీసు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు ప్రజలు బహిరంగంగా విమర్శలు చేస్తున్నారు.



సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా...

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు ఇవ్వండి

జమ్మలమడుగు, జూలై 16: ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు. మంగళవారం జమ్మలమడుగులో కస్తూర్బా పాఠశాలల్లో పనిచేస్తున్న సిబ్బంది విజ్ఞప్తి చేస్తున్నారు. నాలుగు నెలల నుంచి వేతనాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వడ్డీలకు డబ్బులు తెచ్చుకుని జీవనం కొనసాగిస్తున్నట్లు వాపోయారు. అధికారులు వెంటనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఇవ్వాల్సిన నాలుగు నెలల వేతనాలను వెంటనే మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కుష్టువ్యాధిగ్రస్థులను గుర్తించండి

బి.కోడూరు, జూలై 16 : మండలంలోని కుష్టువ్యాధిగ్రస్థులను గుర్తించి వ్యాధి లక్షణాలు ఉన్న వారిని నమోదు చేయాలని వైద్యాధికారులు వినీత్‌కుమార్ రాజు, ఉదయకిరణ్ తెలిపారు. మంగళవారం వైద్యశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 18వతేదీ నుంచి ఆగష్టు 2 వరకు కుష్టువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించాలన్నారు ఆశా కార్యకర్తలతో పాటు ఒక మగ వలంటీరు ప్రతి ఇంటినీ సందర్శించి గుర్తించాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అత్యాచారాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

కొండాపురం, జూలై 16: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి, విజయనగరం జిల్లాలో జరిగిన అత్యాచార ఘటనలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఏపీటీఎఫ్ జిల్లా మహిళా అధ్యక్షురాలు డేరా జ్యోతి, అభ్యుదయ మానవ హక్కుల జాతీయ చైర్‌పర్సన్ రామాంజనమ్మ తెలిపారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ చిన్నపిల్లలపై జరుగుతున్న అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు బాధాకరమని, అత్యంత హేయమైన చర్య అని వారు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న భూమా అఖిలప్రియ

బ్రహ్మంగారిమఠం, జూలై 16 : బ్రహ్మంగారిమఠంలోని పోలేరమ్మ అమ్మవారికి మంగళవారం ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మొక్కు తీర్చుకున్నారు. ఎన్నికలకు ముందు భూమా అఖిలప్రియ ఎమ్మెల్యేగా గెలిస్తే మొక్కు తీర్చుతానని ఎమ్మెల్యే చిన్నాన్న భూమా బ్రహ్మానందరెడ్డి గతంలో అమ్మవారికి మొక్కుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో భూమా సందీప్‌రెడ్డి, సంతోష్, మల్లికార్జునరెడ్డి, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

మహాసభలను జయప్రదం చేయండి

జమ్మలమడుగు, జూలై 16: రాయలసీమ విద్యార్థి పోరాట సమితి 7వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆర్‌వీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి కేసీ పాములేటి తెలిపారు. జమ్మలమడుగులో మంగళవారం ఆయన మాట్లాడారు. జిల్లాలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని అన్నారు. ఆగస్టు 4, 5 తేదీల్లో స్థానిక ఎస్సీ డిగ్రీ కాలేజీలో జరిగే రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌వీపీఎస్ నాయకులు ఎల్లయ్య, రవితేజ, తదితరులు పాల్గొన్నారు.

కంపచెట్లు తొలగింపు

చాపాడు, జూలై 16: ప్రొద్దుటూరు రోడ్లు భవనాల శాఖ అధికారులు మంగళవారం మడూరు గ్రామం వద్ద రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. సుమారు 8 కి.మీ. పొడవునా ఉన్న కంపచెట్లను తొలగించడంతో వాహనదారులకు, బాటసారులకు సౌకర్యం ఏర్పడింది. ఈనెల 12న ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండల టీడీపీ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి మడూరు గ్రామం వద్ద ఉన్న కంపచెట్లను తొలగించాలని ప్రయాణికుల ముఖాలకు, చేతులకు గాయాలు అవుతున్నాయని తెలిపారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందించి అధికారులతో మాట్లాడి కంపచెట్లను తొలగించారు.

